ప్రజల విశ్వాస్వాన్ని కోల్పోయిన విపక్షాలు

- సీఎం కేసీఆర్ పాలనలోనే ఇంటింటికీ చేరిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు
- బీఆర్ఎస్‌ను ఇంటిపార్టీగా చూస్తున్న ప్రజలు
- కాలం చెల్లిన కాంగ్రెస్‌కు పాలకుర్తి నియోజకవర్గంలో స్థానం లేదు
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న పెదమడూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు

దేవరుప్పుల, అక్టోబర్ 6: ఆరు దశాబ్దాలపాటు దగా పడ్డ ప్రజలకు ప్రతిపక్షాలపై నమ్మకం పోయిందని, పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. హనుమకొండలోని మంత్రి నివాసంలో దేవరుప్పుల మండలం పెదమడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీని వీడి శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ కాలం చెల్లిన కాంగ్రెస్ పార్టీలో ఆ పార్టీకి చెందిన కార్యకర్తలు ఇమడలేకపోతున్నారన్నారు. అభివృద్ధిని చవిచూస్తున్న పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు రాజకీయాలకతీతంగా తనకు మద్దతు పలుకుతున్నారని ఎర్రబెల్లి వివరించారు. తాను నిరంతరం పాలకుర్తి నియోజకవర్గ ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్నానని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపానని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతిపక్షాలకు అభ్యర్థులు కరువవడంతో ఆ పార్టీ అధిష్టానం విదేశాల నుంచి డంప్ చేస్తున్నదని ఎద్దేవా చేశారు. డబ్బులు ఎక్కువై ఓట్లు కొందామనే దురుద్దేశంతో కొందరు తిరుగుతున్నారని, వారి ఆటలు పాలకుర్తి నియోజకవర్గ ప్రజల ముందు సాగవనే విషయం తెలుసుకోవాలని హితవు పలికారు. అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వెంట ఉన్నారని, కేసీఆర్‌పై నమ్మకంతో, విశ్వాసంతో ఉండడంతో కాంగ్రెస్ నాయకులకు మింగుడుపడడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

మండలంలోని పెదమడూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు ఆ పార్టీని వీడి మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరిలో వార్డు సభ్యులు మునుగొండ యాదమ్మ, మునుగొండ మల్లయ్య, గణేశ్, శ్రీనివాస్, గోకారపు యాకన్న, మునిగె జలేందర్, తిక్కర్తి రాజు, పెరికె కోటేష్, ఇక్కర్తి రాజు, మునిగొండ అశోక్, మల్లయ్య, అబ్బయ్య, బత్తిని గణేశ్, గోకారపు భరత్, కళమ్మ, మునిగొండ శారద, మునిగె కల్యాణి, బత్తిని ప్రమీల, మునిగొండ యాకమ్మ, పెరికె లలిత, జోగు యాదమ్మ ఉన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పానుగంటి గిరి, బీఆర్ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి నారెడ్డి సంజీవరెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు బానోత్ నవీన్‌నాయక్, నాయకులు పానుగంటి కృష్ణ, దీగోజు కిశోర్, పోచంపల్లి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్లకొండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న కలెక్టర్ శివలింగయ్య, సర్పంచ్ శారద, అధికారులు

సర్కారు స్కూళ్ల బలోపేతమే ధ్యేయం

- విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం
- జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య
- వడ్లకొండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం

జనగామ రూరల్, అక్టోబర్ 6: సర్కారు స్కూళ్లను బలోపేతం చేయడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధిస్తూనే పోషకాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. ప్రతిరోజూ ఉదయం అల్పాహార అందించేందుకు సరికొత్త పథకం అమలు చేస్తున్నట్లు వివరించారు. శుక్రవారం మండలంలోని వడ్లకొండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ఆయన ప్రారంభించారు. శివలింగయ్య స్వయంగా విద్యార్థులకు ఇడ్లీలు వడ్డించడంతోపాటు వారితో కలిసి టిఫిన్ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం అల్పాహార పథకం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం విద్యార్థులకు రుచికరమైన అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో మన ఊరు- మనబడి పథకం ద్వారా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తయారు చేస్తున్నట్లు కలెక్టర్ శివలింగయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాసంస్కరణలు జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల ద్వారా సోషల్ ఫోరం టాలెంట్ టెస్టులో మన జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుహాసిని, జిల్లా విద్యాశాఖ అధికారి రాము, సీపీవో ఇస్మాయిల్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు బొల్లం శారద, పంచాయతీ కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి ఆల్పాహారం తీసుకుంటున్న అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య, చిత్రంలో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, సుహాసిని

ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య

జనగామ చౌరస్తా, అక్టోబర్ 6 : వచ్చే శాసనసభ ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, సుహాసినితో కలిసి జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనల ప్రకారం జిల్లాలో ఎన్నికల విధులకు సంబంధించి శాఖల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి ప్రత్యేక నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల వారీగా సెక్టోరియల్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్కడ కావాల్సిన మౌలిక వసతులు ఎలా ఉన్నాయో సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంపు, మంచినీరు, విద్యుత్, ఫర్నిచర్ తదితర వసతులను ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికల నిర్వహణకు కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణలో అనుమతుల మంజూరు, చెక్ పోస్టుల ఏర్పాటు వంటి విషయాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత సిబ్బంది పకడ్బందీగా ఎన్నికల విధుల్లో చేరాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ నుంచి అభ్యర్థుల వ్యయ ప్రణాళిక పరిశీలనకు కమిటీలను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. మొబైల్ స్క్వాడ్, ట్రాన్స్‌పోర్టేషన్, చెక్ పోస్ట్, సీజింగ్, సర్వేలెన్స్ కెమెరా సిస్టం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర అంశాలకు రూట్ మ్యాప్ సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ శివలింగయ్య ఆదేశించారు. కమిటీల వారీగా ఎన్నికల మాస్టర్ ట్రెయినర్స్‌తో సంబంధిత సిబ్బందికి ప్రతి విషయంలో శిక్షణనిచ్చి పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ శివలింగయ్య పేర్కొన్నారు. ఈ శిక్షణా తరగతిలో జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి ఈఆర్వోలు మురళీ కృష్ణ, రామ్మూర్తి, ముఖ్య ప్రణాళిక అధికారి సయ్యద్ ఇస్మాయిల్, స్వీఫ్ నోడల్ అధికారి వినోద్ కుమార్, సంబంధిత నోడల్ ఆఫీసర్లు, కలెక్టరేట్ ఏవో రవిందర్, తహసీల్దార్లు, ఎన్నికల పర్యవేక్షకుడు ఎతేషాం అలీ, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆరుద్రోత్సవం

పాలకుర్తి, అక్టోబర్ 6 : మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఆరుద్రోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల భజనలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండికా పరమేశ్వరీ దేవికి పంచహారతి, మంత్రపుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

చండికా అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

తొమ్మిదేళ్లలోనే తెలంగాణలో అద్భుత ప్రగతి

- సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్
- ప్రభుత్వ పాఠశాల పరిశీలన

పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడుతున్న జూలూరు గౌరీశంకర్

జనగామ చౌరస్తా, అక్టోబర్ 6 : తెలంగాణ సరికొత్త చరిత్రను పునర్ లిఖించుకుంటున్నదని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గీతా నగర్ బాలికల జడ్పీ హైస్కూల్‌ను జూలూరు సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం గౌరీశంకర్ మాట్లాడుతూ విజేతలు రాసే చరిత్ర పరాజితుల వేదనను లోకానికి తెలియనివ్వదు, వేటగాడు రాసే చరిత్ర లేడి నెత్తురు విషాదాన్ని దాచిపెడుతుందని తెలిపారు. అందువల్ల చరిత్రను ఎవరికి వారే అధ్యయనం చేసి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనుభవించిన వారు చెబితే తెలుసుకోవాలి, బాధితులు, పీడితుల స్వరాల్లోంచి నేరుగా వినాలన్నారు. అప్పుడే వాస్తవం.. వాస్తవంగా తెలుస్తుందని పేర్కొన్నారు. మీ ఊరి చెరువు ఎలా ఉంది? నీళ్లు ఉన్నాయా? ఇళ్లల్లో మంచినీళ్లు వస్తున్నాయా? ఇటీవల ఊళ్లో చెరువుల పండుగ జరుపుకున్నారా? బోర్లలో నీళ్లు బాగా వస్తున్నాయా? బావుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయా? చెరువు నిండి అలుగు పారుతుందా? మన ఊరు-మన బడి, మన ఊరు-మన చెట్లు కార్యక్రమం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తొమ్మిదేళ్ల క్రితం తెలంగాణ ఎలా ఉంది? నీళ్ల కోసం వృద్ధులు, మహిళలు ఎంత దూరం వెళ్లాల్సి వచ్చేది? పొలాల్లో కరెంట్ కోసం ఎలా నిద్రకాయాల్సి వచ్చేది? అనే విషయాలపై మీ ఊళ్లలో పెద్దలను అడిగి తెలుసుకోవాలని గౌరీశంకర్ విద్యార్థులకు సూచించారు. విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు ప్రజలకు అందడంలో గతానికి, ఇప్పటికీ ఉన్న తేడాలు తెలుసుకోవాలని వివరించారు. తెలంగాణ సాధించింది ఏమిటో మీకు మీరుగా అవగాహన చేసుకోవాలన్నారు. దీనికి విద్యార్థులు తమ ఊరి చెరువులు ప్రస్తుతం నిండు కుండలా ఉన్నాయని తెలిపారు. ఇళ్లల్లో నల్లాల ద్వారా మంచీనీళ్లు రోజు వస్తున్నాయని పేర్కొన్నారు. చెరువు కట్ట వద్ద ఊరంతా కలిసి ఘనంగా పండుగ జరుపుకున్నామని వివరించారు. బోర్లలో, బావుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. మన ఊరు-మన చెట్టు కార్యక్రమం గొప్పగా ఉందని పేర్కొన్నారు. మన ఊరు-మన బడితో పాఠశాల రూపు రేఖలు మారినట్లు తెలిపారు. మిషన్ కాకతీయ పేరుతో నీళ్ల పండుగ చేసుకోవడం గురించి తరగతి గదిలో పాఠశాల విద్యార్థులు చెప్పడం తెలంగాణ అభివృద్ధికి సంకేతం అని గౌరీ శంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురిజాల శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎర్రోజు శ్రీనివాస్, షఫీ అహ్మద్, రాజు, అజీజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.